# జవాబు చెప్పలేదు

'పెళ్ళిచూపుల కొస్తున్నారు. వాళ్లు చాలా భాగ్యవంతులు. అమ్మాయిని చూసుకుని వెళ్ళిపోతారు. పావుగంటుంటారు. ఈ పావుగంటలో వాళ్ళకి తగిన మర్యాద చేసి పంపెయ్యాలి.' ప్లీడరుగారు చెప్పి కచేరి గదిలోకి వెళ్ళిపోతున్నారు.

'సమయానికి కోడలులేదు. అనుకున్న ప్రకారం యివాళ మెయిల్లో ఆవిడగారు దిగితే నాకొక్కంత బరువు తగ్గుతుంది.' ప్లీడరుగారి భార్య అంది.

'పెద్దబ్బాయ్ : నువ్వీవేళ ఆఫీసుకు సెలవు పెట్టేవా ? మెయిలు కెళ్ళి మీ ఆవిణ్ణి తీసుకురా' ప్లీడరుగారు.

పెద్దబ్బాయ్ అలాగే అన్నాడు.

'ఫలహారానికి యేవిటి చేయిస్తే బాగుంటుంది ?' అబ్బాయ్ తల్లి అబ్బాయ్ తండ్రినడిగింది.

'అదంతా నీ డిపార్టుమెంటు—'

'సరే. మైసూర్‌పాక్, బజ్జీ చేయిస్తా...'

పెళ్ళిచూపులనగానే యింటికి పెళ్ళికళ, బూరెలవాసన అప్పుడే వచ్చేసింది.

'సిన్నమ్మగోరో ! పెళ్లయి అత్తోరింటికెలిపోతే నన్ను మరిచి పోతావా ?' పనిమనిషి అప్పలమ్మ సరదాగా అడిగింది. విరబోసిన తల ఆరబెట్టుకుంటూ పెళ్ళికూతురు నవ్వింది. 'నిన్నెలా మర్చిపోవడమే అప్పలమ్మా నీ కేక మా అత్తారూరిదాకా వినిపిస్తుంది.'

పెళ్ళికూతురు చదువు ముగించి నాలుగేళ్ళైంది. ఆమె ఉద్యోగం చెయ్యటం తల్లికిష్టంలేదు. తండ్రి సమ్మందాల కోసం గాలిస్తున్నాడు. అందరూ ఆలస్యమైపోతూందంటున్నారు.

'బాబూ ! అమ్మాయిగారికి త్వరగా పెళ్ళి చేసేయటం మంచిది.' ప్లీడరుగారి గుమాస్తా ఓనాడు కళ్ళజోడు నుంచి చూస్తూ సలహా యిచ్చేడు.

'అలా వెధవసలహా లివ్వకపోతే, ఓ మంచి సంబంధం వెతికిపెట్ట రాదూ ? పిల్లనివ్వడం అంటే ఏమిటి ? తోటకూర బేరమనుకున్నావా...'

'అమ్మమ్మా... యెంతమాట ! మనమ్మాయి సాక్షాత్తు లక్ష్మీదేవి. ఆమెకి బాగా చదుకున్నవారు, మంచి సంప్రదాయంగలవారూ, అందం చందం గలవారే భర్త వుతారు. నాకు తెలుసు, అమ్మాయి జాతకం నేనే రాశానుగదా...' గుమస్తా.

'ఏమయ్యోయ్ కొంచెం వంటిమీద తెలివుంచుకుని మరీ చెయ్యి మైసూర్‌పాక్. లేకపోతే నాకుబదులు అదే పరుగెడుతుంది గుమ్మందాకా పెళ్ళివార్నెదుర్కోవడానికి.' ప్లీడరుగారి భార్య వంటాయన్ని హెచ్చ రించింది.

'అమ్మమ్మా! ఎంతమాటా! వచ్చేది వియ్యాల వారంటే నాకు మాత్రం తెలీదా? నా చేతి మైసూర్‌పాక్ ఇవాళ రుచిచూసి, మళ్ళీ పెళ్ళిలో అదే చేయించమని వాళ్ళే ఉత్తరం వ్రాయకపోతే నాపేరు...' వంటాయన పోపు కలుపుతూన్న గరిట గదలా తిప్పేడు.

పెళ్ళి కూతురి మనసు పరవళ్ళు తొక్కుతూంది. ఆయన యెట్లా వుంటాడు? పొడుగ్గానా? తెల్లగానా? నవ్వితే బహుశా చంద్రుళ్ళా ఉంటాడు.

ప్లీడరుగారు పదిన్నరకి కోర్టుకి పోయారు. తిరిగి మూడు కాకుండా వచ్చేస్తానన్నారు.

'అబ్బాయ్! మెయిలు టైమైందేమో' తల్లి.

'ఇంకా చాలా టైముందమ్మా. ఇప్పుడు పదకొండే అయింది. మెయిలు పన్నెండున్నర కొస్తుంది. ఇంతకీ నీ కోడలు అంత నంగనాచి కాదు. సాయం లేకపోయినా చక్కా రాగలదు.'

మాటలలోనే ఆఫీసునుంచి కబురొచ్చింది. అర్జెంటు పనుంది తిరిగి ఒంటిగంటకు వెళ్ళిపోవచ్చని అధికారి కబురు పెట్టేడు.

'అమ్మా! నేను అర్జెంటు పనిమీద ఆఫీసుకెళ్తున్నా. ఒంటిగంట కొచ్చేస్తా. వెంకన్నని మెయిలుకి పంపు.'

అబ్బాయ్ ఆఫీసుకెళ్ళేడు. వెంకన్న మెయిలుకెళ్ళేడు.

'దండాలమ్మ...'

పెద్ద కోడలు రైలు దిగింది.

'ఓహో వెంకన్నా! చిన్నబాబుగారు రాలేదా?'

'రావాల్నే అనుకున్నారండి. సెలవు పెట్టేరు కూడా. కాని ఏదో అరిజంటు పని పడ్డాది. ఆఫీసుకెళ్ళి నన్నిలా తోలేసినారు.'

'ఊహూఁ ...అంతా కులాసాయేనా...?'

'సిత్తం. సిన్నమ్మాయిగారికి పెళ్ళండి, ఇయాల సూపుల కొత్తున్నారండీ....'

'ఇవాళే!'

'సిత్తం'

పెద్ద కోడలు ఆశ్చర్యపోయింది.

'ఇంత అర్ధాన్తుగా...'

'సిత్తవండి...'

పెద్ద కోడలు పొడుగ్గా, చాలా అందంగా వుంటుంది. తక్కువ మాట్లాడుతుంది. అసలు స్త్రీ హృదయమే లోతైంది. ఆమె హృదయం మరీను.

'ఏవమ్మా మరదలుపిల్లా! చెప్పకుండా చెయ్యకుండా చూపులేర్పాటు చేసుకున్నావు, గడుసుదానివే!' హాస్యమాడింది.

పెళ్ళికూతురు నవ్వింది.

'వచ్చేవా తల్లీ! నువ్వులేకపోతే ఇవాళ ఈ కార్యక్రమం ఎలా జరిగేదో' అత్తగారు కోడల్ని పలకరిస్తూ అంది.

ఇల్లంతా ఒకటే సందడి.

పెళ్ళికూతురు దేవకన్యలావుంది. వదినా, మరదళ్ళిద్దరూ బాగా చదువుకున్నారు. ఇంట్లో రెండు మాణిక్యదీపాల్లా తిరుగుతున్నారు.

ప్లీడరుగారు రెండు కాకుండా కోర్టునించివచ్చేరు. పెద్ద కొడుకు అంతకుముందే వచ్చేడు.

'రాణీగారు సమయానికి దిగబడ్డారు. మీరులేకపోతే పెళ్ళిచూపులు రక్తిగావుండవు' పెద్దబ్బాయ్ ఛలోక్తివిసిరేడు గదిలో. ఆమె నవ్వింది. భార్యంటే అతనికి వెర్రి ప్రేమ.

'పెళ్ళికొడుకెలావుంటాడో' అతను.

'మీ రిదివరకు చూళ్ళేదా ?'

'ఎవ్వరూ చూళ్ళేదు, అంతా అధార్తుగానే జరుగుతూంది.'

మూడుగంటలకి ఎక్స్‌ప్రెస్‌కి పెద్దబ్బాయ్ వెళ్లేడు. రైలు టైముకే వచ్చింది. పెళ్ళికొడుకు, తల్లి, చెల్లెలు, బంట్రోతు దిగేరు.

'నమస్కారం' పెళ్ళికొడుకు నవ్వుతూ, ప్లీడరుగారితో అన్నాడు. ప్లీడరుగారు కాబోయే అల్లుణ్ణి దీవిస్తూ ఆహ్వానించేరు.

పొడుగ్గావున్నాడు. తెల్లని కళ్లు. సన్నగా అందమైన మీసకట్టు. ప్లీడరుగారి భార్య ఒకటే మురిసిపోయింది.

వాళ్ళనొక గదిలో దింపేరు. వాళ్లు స్నానాలు ముగించి బట్టలువేసు కునేసరికి ఐదున్నరైంది. వర్జ్యంలేదు.

ఫలహారాలయేక, ప్లీడరుగారి భార్య వాళ్ళతో కొంచెంసేపు లోకాభి రామాయణం సాగించింది.

'అమ్మాయిని తీసుకురమ్మను...' తల్లి పెద్దబ్బాయితో అంది. పెద్దబ్బాయ్ భార్యని కేకేసి 'చెల్లెల్ని తీసుకురా' అని, ఏమీ తోచక తను కూడా నాలుగడుగులు వేసేడు.

చెల్లెలు నిజంగా లక్ష్మీదేవిలా మెరిసిపోతూంది. నిండుగా, నిబ్బ రంగా ఉంద. కాని అదేవిటి తన భార్య వణికిపోతూంది !

'నువ్వే పెళ్ళికూతుర్లా వణికిపోతున్నావా ? అమ్మాయిగారికి పాత అనుభవం జ్ఞాపకానికొస్తూంది కాబోలు...' ఛలోక్తి విసిరాడు.

ఆమె గుండె ఝల్లుమంది.

వచ్చిన వాళ్ళు సంతోషంగా వెళ్ళేరు. వాళ్ళ ఊరు వెళ్ళి రాస్తామ న్నారు. కానీ సమ్మంధం స్థిరపడ్డట్టే అని ధీమా పడ్డారు ప్లీడరుగారు.

ఇంటికి పూర్తిగా పెళ్ళి కళొచ్చింది.

ఆ రాత్రి - పెద్దబ్బాయి గదిలో...

'రాణీగారికి పెళ్ళికొడుకు నచ్చాడా?'

ఆమె జవాబు చెప్పలేదు.

బుగ్గగిల్లి 'మాటలు రావా' అన్నాడు.

అతనికీ తలిదండ్రుల్లాగే, చెల్లెల్లాగే సంతోషం ఉప్పెనలా పొంగుతూంది.

'మీరు పెళ్ళికూతురు కాదండీ రాణీగారూ, మాచెల్లెలు. మరి సిగ్గెందుకు చెప్పండి, ఆ పెదాలమీంచి తేనెలా రెండు పలుకులొలకనీండి...'

ఆమె యెగిరిపడుతున్న హృదయాన్ని సముదాయించుకుని డగ్గుత్తికతో అంది—

'ఈ సమ్మంధం వద్దండి...'

'ఏం?'

భయంకరమైన జ్ఞాపకాలతో ఆమె తల తిరిగిపోయింది. పాము అందంగా వుంటుంది. ఆశపడి దగ్గరకెళ్తే కాటేస్తుంది.

'రాణీగారేవిటో దీర్ఘంగా ఆలోచిస్తున్నారు. ఈ సమ్మంధం ఎందుకొాదు?'

అతనికేసి అయోమయంగా చూసింది. జాలిగా తలూపింది. అంతకన్నా జవాబు చెప్పలేదు.

★